# ఉద్రిక్తం.. గాంధీ భవన్

- తమ నాయకుడికే టిక్కెట్ కేటాయించాలనని ఆందోళన
- కామారెడ్డి టిక్కెట్ తనకే కేటాయించాలని గాంధీ విగ్రహం వద్ద బైఠాయించిన బెల్లయ్య నాయక్
- రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలు



జూబ్లీహిల్స్‌లోని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

సుల్తాన్ బజార్, నవంబర్ 7: పార్టీ కోసం పని చేసిన వారినొదిలేసి ప్యారాచూట్ నాయకులకు టికెట్లు ఇస్తూ వింతగా, వికృత పోకడలు పోతున్న కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వంపై ఇంతకాలం పని చేసిన కార్యకర్తలు, నేతలు దుమ్మెత్తి పోస్తున్నారు. గాంధీ భవన్, రేవంత్ రెడ్డి ఇంటి వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఇక ముందు రానున్న జాబితాలో పార్టీ కోసం పని చేసిన వారికి మాత్రమే చోటు కల్పించాలని అధినేతలకు వివిధ వర్గాలకు చెందిన నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేస్తున్న అభ్యర్థుల జాబితాలో మొదటి నుంచి వివాదాస్పదంగానే మారింది. కాగా, మంగళవారం వనపర్తి నియోజకవర్గానికి మాజీ మంత్రి చిన్నారెడ్డికి టిక్కెట్ కేటాయిస్తూ పార్టీ అధిష్టానం జాబితాను విడుదల చేసింది. ఇదిలా ఉండగా, తిరిగి చిన్నారెడ్డికి కేటాయించిన టిక్కెట్‌ను రద్దు చేయడంతో గాంధీ భవన్‌కు చేరుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి అనుచరులు, నాయకులు, కార్యకర్తలు ఆందోళన బాట పట్టారు. వనపర్తి టిక్కెట్‌ను మాజీ మంత్రి చిన్నారెడ్డికి రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన నాయకులు చిన్నారెడ్డిపై పార్టీకి రాజీనామా చేయాలని తీవ్ర స్థాయి లో ఒత్తిడి తీసుకువచ్చారు. చిన్నారెడ్డికే టిక్కెట్ ఇవ్వాలని ఆందోళనకు దిగిన నాయకులను చిన్నారెడ్డి ఓదార్చారు. అయితే, పటాన్ చెరువు టిక్కెట్‌ను కాటం శ్రీనుకే కేటాయించాలని నాయకులు, కార్యకర్తలు ఆందోళన బాట పట్టడంతో తీవ్ర ఉద్రిక్తంగా మారింది. కాటం శ్రీనుకు కాకుండా నీలం మధుకు ఎలా టిక్కెట్ కేటాయిస్తారని ఆందోళన బాటపట్టిన నాయకులను గేట్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కామారెడ్డి టిక్కెట్ తనకే కేటాయించాలని కార్యకర్తలతో కలిసి బెల్లయ్య నాయక్ గాంధీభవన్‌లోని గాంధీ విగ్రహం వద్ద బైఠాయించారు.

## కాటం శ్రీనివాస్ గౌడ్‌కు అన్యాయం

బంజారాహిల్స్: పటాన్‌చెరువు కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఎన్నో ఏళ్లుగా పార్టీకోసం కష్టపడుతున్న కాటం శ్రీనివాస్ గౌడ్‌కు కాకుండా పార్టీ సభ్యత్వం కూడా లేని నీలం ముదిరాజ్‌కు ఎలా ఇస్తారంటూ వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నివాసం ముట్టడికి యత్నించారు. మంగళవారం ఉదయం పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నివాదాలు చేశారు. 100 కోట్లకు నీలం ముదిరాజ్‌కు టికెట్ అమ్ముకున్నాడంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. గత ఎన్నికల్లో సుమారు 80 వేల ఓట్లు సాధించిన కాటం శ్రీనివాస్ గౌడ్ పార్టీని కాపాడుకుంటూ కోట్లాది రూపాయలు ఖర్చు చేశాడని కన్నీళ్లపర్యంతమయ్యారు. రాత్రికి రాత్రే కోట్లాది రూపాయలు తీసుకుని పార్టీలో కనీసం సభ్యత్వం కూడా లేని నీలం ముదిరాజ్‌కు టికెట్ ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీని చంపేశాడని ఆరోపించారు. తమ నాయకుడికి అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు, రేవంత్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డి ఇంటివద్దకు వెళ్లేందుకు యత్నించగా పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు.

## మూడో జాబితా మార్చకుంటే.. గాంధీ భవన్ బద్దలైద్ది

### గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు గణేశ్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గణేశ్ నాయక్

ఖైరతాబాద్, నవంబర్ 7: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేసిందని, అభ్యర్థుల చివరి జాబితాలోనూ మోసం చేసిందని గిరిజన విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దరావత్ గణేశ్ నాయక్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేవలం అగ్రవర్ణ పార్టీగా మిగిలిపోయిందన్నారు. రేవంత్ రెడ్డి తన సామాజికవర్గానికే ప్రాధాన్యనిచ్చారు తప్ప బడుగు వర్గాలను నిర్లక్ష్యంగా చేశారన్నారు. కోట్లు చెల్లించిన వారికే టికెట్లు కేటాయించారని, పేద, బలహీనవర్గాలకు చెందిన ఉద్యమకారులైన బెల్లయ్య నాయక్, మానవతారాయ్, అద్దంకి దయాకర్‌లకు మొండి చేయి చూపారన్నారు. ఉదయ్ పూర్ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఈ ఎన్నికల్లో ఉద్యమకారులకు, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ముగ్గురు అభ్యర్థులకు టికెట్లు ఇస్తామని చెప్పారని, కాని, ఆ నిర్ణయాన్ని తుంగలో తొక్కారన్నారు. వారికి టికెట్లు ఇస్తే వారు సీఎం స్థాయికి ఎదుగుతారన్న ఉద్దేశంతోనే వారిని పక్కన పెట్టారన్నారు. బడుగులంటే రేవంత్‌కు ఇష్టం ఉండదన్నారు. ఇప్పటికైనా చివరి జాబితాలో సవరణ చేయాలని, లేని పక్షంలో గాంధీ భవన్‌ను బద్దలు కొడుతామని, సీఎం స్థాయి వరకు ఎదిగే వారని తొక్కేశారన్నారు. 119 నియోజకవర్గాలు తిరిగి కాంగ్రెస్ అభ్యర్థులను ఓడగొడుతామన్నారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుట్టంగండి శ్రీను నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీ నాయక్, ఉపాధ్యక్షులు బాదావత్ భాస్కర్ నాయక్, కాట్రావత్ శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి మురళీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో బండారిని గెలిపిస్తాం

### ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి హామీ



మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో ఎమ్మెల్యే భేతి, బీఆర్ఎస్ నేతలు

ఉప్పల్, నవంబర్ 7: ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి మంగళవారం మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను, తన అనుచరులతో మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ సుభాష్‌రెడ్డికి సముచితస్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. అందుకు ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిపిస్తామని మంత్రులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు గరిక సుధాకర్, లేతాకుల రఘుపతిరెడ్డి, కాటేపల్లి రవీందర్‌రెడ్డి, వనంపల్లి గోపాల్‌రెడ్డి, పల్లా కిరణ్ కుమార్ రెడ్డి, గూడూరు శైలేష్‌రెడ్డి, బండ వినీష్ రెడ్డి, శీతల విజయ్ కుమార్, జంగారెడ్డి, నవీన్‌రెడ్డి, రాజు, ఎల్లేష్, నాగిరెడ్డి, వీరేష్, మాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎల్బీ నగర్‌లో బీఆర్ఎస్‌కు అఖండ విజయం ఖాయం

- మేం ఇద్దరం కలిసిపోయాం.. బలగాలు ఒక్కటయ్యాయి...
- సుధీర్ రెడ్డిదే ఘన విజయం: ఎల్బీ నగర్ బీఆర్ఎస్ నేత ముద్దగౌని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్

ఎల్బీనగర్, నవంబర్ 7: ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి అఖండ విజయం ఖాయమని, సుధీర్ రెడ్డి ఘన విజయం సాధిస్తారని ఎల్బీనగర్ బీఆర్ఎస్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్‌లోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ మాట్లాడారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తాను ఇద్దరం కలిసిపోయామని, మా రెండు బలగాలు ఒక్కటయ్యాయని, ఇక బీఆర్ఎస్ విజయమే తరువాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయమని, ఎల్బీనగర్‌లోనూ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మూడోసారి విజయం సాధిస్తారన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో జరిగిన పరిణామాలు ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. తాను గత రెండు పర్యాయాలు పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయానన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ కలిసి పోటీ చేయడంతో బీఆర్ఎస్ ఓడిందన్నారు. 2014 ఎన్నికల్లో తాను, ఆర్.కృష్ణయ్యలు బీసీ నాయకులుగా పోటీ చేసినా కృష్ణయ్యను గెలిపించారన్నారు. తాజాగా బీఎన్‌రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్నకు కాంగ్రెస్ టిక్కెట్టు ఇస్తామని చెబితేనే తాము కాంగ్రెస్‌లో చేరామని, తమను మోసం చేసినందునే సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ఆహ్వానం మేరకే తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చామన్నారు. ఎల్బీనగర్ బిడ్డగా, బీసీ బిడ్డగా ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. ఎల్బీనగర్ అసెంబ్లీ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఎల్బీనగర్‌లో సుధీర్‌రెడ్డి గెలుపును తన భుజస్కంధాలపై వేసుకుని పనిచేస్తానన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి కోట్ల రామకృష్ణ రాజీనామా

- పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్ష పదవికీ రాజీనామా
- బీఆర్ఎస్‌లో చేరేందుకు నిర్ణయం



కోట్ల రామకృష్ణ

అంబర్‌పేట, నవంబర్ 7: కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు, బాగ్ అంబర్‌పేట డివిజన్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కోట్ల రామకృష్ణ ఆ పార్టీకి, పార్టీ పదవికి రాజీనామా చేశారు. పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో ఆయన పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. రాజీనామా లేఖను హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ పి.జ్ఞానేశ్వర్ గౌడ్, బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు జి.శ్రీధర్ గౌడ్‌కు పంపించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో బుధవారం చేరుతున్నట్టు పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌కు ఎందుకు పనిచేయాలి

- టీడీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కొండ్రన్‌పల్లి గిరిబాబు
- టీడీపీ ఓట్లతో గెలిచిన రేవంత్ ఏం చేశాడో చెప్పాలి?
- టీడీపీలో అంతర్గత కోవర్టులున్నారు..



ఉప్పల్, నవంబర్ 7: గతంలో 2018 ఉప్పల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వీరేందర్ గౌడ్ ఓటమికి కాంగ్రెస్ పార్టీ కారణమని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండ్రన్‌పల్లి గిరిబాబు అన్నారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఓటు బ్యాంకును కాపాడుకుంటామని, ఇతర పార్టీలకు డైవర్ట్ కాకుండా చూస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేయడానికి పలువురు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ అధినేత ఆదేశాలు ఇచ్చేవరకు ఏ పార్టీకి మద్దతు ఇవ్వవద్దన్నారు. టీడీపీ నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, పార్టీ ఆదేశాలు రాకపోతే ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని తెలిపారు. గతంలో బీజేపీ అభ్యర్థి విజయంలో టీడీపీ ఓట్లే కీలకంగా మారాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీతో కొంత మంది లోపాయికారిగా మారారని, టీడీపీలో అంతర్గత కోవర్టులు ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎందుకు పనిచేయాలో చెప్పాలన్నారు. ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఏం పని చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థితో చర్చలు జరపడం సరికాదన్నారు. పార్టీ ఆదేశాల మేరకు పనిచేయాలన్నారు. ఈ నెల 9న నామినేషన్ వేస్తామని ప్రకటించారు.